క్రీడలతో విద్యార్థులకు ఉన్నత భవిష్యత్తు

- ఎంపీ అనురాధ, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి
- నియోజకవర్గ స్థాయి గేమ్స్ ప్రారంభం



కొత్తపేటలో షటిల్ ఆడుతున్న ఎంపీ అనురాధ, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: విద్యార్థుల ఉన్నత భవిష్యత్‌కు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సభకు ఎంపీపీ మార్గన గంగాధర రావు అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ ప్రతి వ్యక్తికీ ఆరోగ్యమే మహాభాగ్యం. అందుకు దేహదారుఢ్యం, మానసిక ఉల్లాసం ముఖ్యమన్నారు. సీఎం జగన్ విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసే ప్రయత్నంలో భాగంగా పాఠశాల స్థాయిలో గేమ్స్ ఏర్పాటు చేసి క్రీడా ప్రోత్సాహాన్ని అందిస్తున్నారన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా ప్రావీణ్యం పొంది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడా ప్రతిభను చాటాలని, తద్వారా ఈ ప్రాంతం, ఈ రాష్ట్రం కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపచేయాలని సూచించారు. ఇక్కడ బాస్కెట్‌బాల్ కోర్టు ఆధునీకరణకు చర్యలు తీసుకుంటామని స్థానిక క్రీడాకారులకు హామీ ఇచ్చారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, క్రీడా పతాకాన్ని అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు ఆవిష్కరించారు. షటిల్ కోర్టును ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, వాలీబాల్ కోర్టును ఎంపీ అనురాధ, వివిధ కోర్టులను అముడా చైర్మన్ డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి ప్రారంభించారు. అనంతరం వారు షటిల్ బాడ్మింటన్, వాలీబాల్ క్రీడలను ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ముందుగా రిటైర్డ్ పీఈటీలు నల్లా సత్యనారాయణమూర్తి, మారిశెట్టి సత్యనారాయన, వైసీ రామన్నలను జగ్గిరెడ్డి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్రీడా జోన్ పీఈటీల గౌరవాధ్యక్షుడు కర్రి నాగిరెడ్డి, బాస్కెట్‌బాల్ జాతీయ స్థాయి పూర్వ క్రీడాకారుడు, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, ఎంపీటీసీ పేపకాయల బ్రహ్మానందం, జిల్లా ఎస్టీ విభాగం అధ్యక్షుడు కుర్రా శ్రీను, పీఎంసీ చైర్మన్ బీర శ్రీను, గ్రామ పార్టీ అధ్యక్షుడు సలాది బ్రహ్మాజీ, ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్, హెచ్ఎం అల్లూరి గోపాలరాజు తదితరులు పాల్గొన్నారు.



అంబాజీపేటలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

అంబాజీపేట: ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు గెలుపోటములు సమానంగా స్వీకరించాలని ఎంఈఓ కె.వెంకటేశ్వరరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం కడలి సాయిరామ్ పర్యవేక్షణలో బాలికల క్రీడా పోటీలను శుక్రవారం నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. పీడీలు కె.ఆదిలక్ష్మి, అందె సూర్యనారాయణ, మట్టా శ్రీనివాసరావు, బి.చిరంజీవి, ఎం.పవన్‌కిషోర్, వి.శ్రీనివాస్ తదితరుల పర్యవేక్షణలో క్రీడాపోటీలు నిర్వహించారు. అండర్-17 బాలికల విభాగం వాలీబాల్‌లో ముక్కామల, పుల్లేటికుర్రు, బాల్‌బ్యాడ్మింటన్‌లో పుల్లేటికుర్రు, తొండవరం, ఖోఖోలో ఇసుకపూడి, తొండవరం, కబడ్డీలో గంగలకుర్రు, ఇరుసుమండ, అండర్-14 వాలీబాల్‌లో ముక్కామల, అంబాజీపేట, బాల్ బ్యాడ్మింటన్‌లో అంబాజీపేట, పుల్లేటికుర్రు, ఖోఖోలో పుల్లేటికుర్రు, ఇసుకపూడి, కబడ్డీలో ఇరుసుమండ, అంబాజీపేట ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు

పి.గన్నవరం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయిలో జరుగుతున్న క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. విద్యార్థులకు ఎనిమిది విభాగాల్లో పోటీలు నిర్వహించి, విజేతలను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. క్రీడా పోటీల సమన్వయ కర్త కేవీ రమణ, ఎంఈఓ కోన హెలీనా, హెచ్ఎం డీఎస్‌వీ ప్రసాద్, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ గూటం శ్రీనివాసరావు, పీడీలు కె.భీమేంద్ర, ఎస్.కమల్, వై.సతీష్, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో ఓఎన్జీసీ భాగస్వామ్యం కావాలి



బిళ్లకుర్రులో కుట్టుమెషీన్లు పంపిణీ చేస్తున్న ఎంపీ అనురాధ, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, ఈడీ అమిత్‌నారాయణ

కొత్తపేట: ఓఎన్జీసీ కార్యకలాపాలు నిర్వహిస్తున్న గ్రామాల్లో రోడ్లు, వాటర్ వంటి సౌకర్యాలకు సీఎస్సార్ నిధులు కేటాయించడం ద్వారా ఆయా గ్రామాల అభివృద్ధిలో ఓఎన్జీసీ భాగస్వామ్యం కావాలని ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ఆ సంస్థకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని బిళ్లకుర్రు శివారు తరెట్లవారిపేట దివంగత ఐఏఎస్ అధికారి తరెట్ల ధర్మారావు-విద్యారావు దంపతుల స్మారక భవనంలో ది యంగ్ హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రామంలో 50 మంది మహిళలకు 40 రోజుల పాటు కుట్టు శిక్షణ ఇచ్చారు. వారికి రూ.7 లక్షల సీఎస్సార్ నిధులతో 50 కుట్టుమెషీన్లు సమకూర్చగా శుక్రవారం వాటిని పంపిణీ చేశారు. సర్పంచ్ నెల్లి లక్ష్మీపతిరావు అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీ అనురాధ, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, ఓఎన్జీసీ ఈడీ అమిత్‌నారాయణ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ మహిళలు తమ కాళ్లపై తాము నిలబడి స్వయం ఆర్థికాభివృద్ధితో జీవనం సాగించేందుకు ఓఎన్జీసీ సీఎస్సార్ నిధులతో కుట్టుమెషన్లు సమకూర్చడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ ఓఎన్జీసీ కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఈ గ్రామంలో సుమారు 25 ఎకరాల్లో కొబ్బరి చెట్లు చనిపోయి, రైతులు తీవ్రంగా నష్టపోయారని ప్రస్తావిస్తూ, నష్టపరిహారం కోసం ఎన్నోసార్లు మీ అధికారుల దృష్టికి తీసుకువచ్చినా ఫలితం లేదని వాపోయారు. రైతులకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే నియోజకవర్గంలోని పలు సమస్యలను ప్రస్తావించి వాటిని పరిష్కరించాలని కోరారు. మరో 50 మంది బ్యాచ్‌కు శిక్షణ ఇచ్చి కుట్టుమెషన్లు మంజూరు చేయాలని కోరారు. అనంతరం మహిళలకు కుట్టుమెషీన్లు పంపిణీ చేశారు. అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, ఓఎన్జీసీ సీఎస్సార్ ఇన్‌చార్జ్ ఆర్ఎస్ రామారావు, జీఎం జగన్నాథరావు, ది యంగ్ హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.సుశీల, ఎంపీడీఓ ఈ మహేశ్వరరావు, గ్రామ కార్యదర్శి మంగిపూడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



నగరంలో లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: అడిగిన ప్రతి ఒక్కరికీ ఆర్థిక సహాయం అందిస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబ పెద్దగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. నగరంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నియోజకవర్గ పరిధిలోని 15 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.28 లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. చిట్టిబాబు మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ ద్వారా ఎంతో మంది నిరుపేదలకు ఆర్థిక సహాయం అందించామన్నారు. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా సీఎం పెద్ద మనసుతో స్పందించి సహాయం అందిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులకు ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం మాత్రమే ప్రతిపక్షాలు ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయని వాటిని ఏమాత్రం పట్టించుకోవద్దన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, మండల జేసీఎస్ ఇన్‌చార్జ్ జక్కంపూడి వాసు, ఎంపీటీసీ వలవల పెద బాబు, పార్టీ నేతలు అన్వర్ తాహిర్ హుస్సేన్, గెద్దం వెంకటేశ్వరరావు, కుసుమ శ్రీనివాస్, యేడిద లక్ష్మణరావు, పితాని సురేంద్ర, గోగి రామ్మూర్తి, కీర్తి రైనా తదితరులు పాల్గొన్నారు.

చలపతిరావు పరిశోధన.. ఎర్త్ అండ్ ఎన్విరాన్మెంట్‌లో ప్రచురణ

అంబాజీపేట: స్థానిక డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి ఎన్బీవీ చలపతిరావు తెల్లదోమ నివారించే మిత్రపురుగు ఎవరోక్రైసా ఆస్టర్ను తక్కువ ఖర్చుతో రైతులకు అందించిన పరిశోధనను ఎర్త్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సైన్స్‌లో ప్రచురితమైంది. ఈమేరకు చలపతిరావు శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. అంతర్జాతీయ కొబ్బరి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 50వ అంతర్జాతీయ కోకోటెక్ సమావేశంలో ఎవల్యూషన్ ఆఫ్ కోకాస్ట్ ప్రొటీన్ సబ్‌స్టిట్యూట్స్ ఇన్ అడల్ట్ డైట్ ఆఫ్ ఎవర్తోక్రైసా ఆస్టర్ బేంక్స్ (న్యూరోప్టె క్రైసోపిడే అండర్ లేబొరేటరీ కండీషన్స్ పత్రంలో ప్రచురించారని చలపతిరావు తెలిపారు. కొబ్బరిని ఆశించే రూగోస్ తెల్లదోమ నివారించే మిత్ర పురుగు అయిన ఎవరోక్రైసా విధానాన్ని గుర్తిస్తూ ఈ ప్రచురణ చేశారన్నారు. దేశ, విదేశాల్లో ఉన్న శాస్త్రవేత్తలకు మిత్ర పురుగులను తక్కువ ఖర్చుతో పెంచడానికి అవసరమైన విజ్ఞానానికి ఈ ప్రచురణ ఎంతో దోహద పడుతుందన్నారు. ఈ ప్రచురణ చేసినందుకు గుర్తింపుగా వారు అంబాజీపేట శాస్త్రవేత్త కృషికి ఇంటర్నేషన్ కోకోనట్ కమ్యూనిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అండ్ ఎడిటర్ ఇన్ చీఫ్, కోకోటెక్ కాన్ఫరెన్స్ ప్రొసీడింగ్ డైరెక్టర్ జెల్ఫీనా సి.ఆలోవ్ కృతజ్ఞతలు తెలిపారన్నారు.

ప్రవక్తలకు నిండుశోకంతో ఘన నివాళి

మామిడికుదురు: ముస్లింల ఆరాధ్య దైవం హజరత్ ఇమామ్ హుసన్, మహ్మద్ ప్రవక్తల షహదత్‌ను శుక్రవారం ముస్లింలు నిండుశోకంతో నిర్వహించారు. దీనిలో భాగంగా ఇమామ్ హసన్, మహ్మద్ ప్రవక్తల గుమ్మటాలను మామిడికుదురు, నగరం గ్రామ వీధుల్లో ఊరేగించారు. ముస్లింలు గుండెలు బాదుకుంటూ మాతం నిర్వహించారు. సర్కిల్ ఫర్హత్ అలీబేగ్ ఆధ్వర్యంలో మర్షియా ఆలపించారు. నగరం బడే బీబీ పంజా వరకు ఈ గుమ్మటాలను ఊరేగింపుగా తీసుకు వెళ్లారు. బడే బీబీ పంజాలో షహదత్ మజ్లిస్ జరిగింది. మత ప్రబోధకుడు మహఫూజ్ రజా ఆబేదీ మజ్లిస్‌లను ఆలపించారు. అనంతరం గుమ్మటాలను శాంతపర్చారు. తదుపరి భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన ముస్లింలు ఈ కార్యక్రమాల్లో పాల్గొని ప్రవక్తలకు శ్రద్ధాంజలి ఘటించారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి కొబ్బరి సమస్యలు

మామిడికుదురు: కొబ్బరి రైతుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లాలని మామిడికుదురులో శుక్రవారం జరిగిన నారియల్ భారత్ న్యూట్రా ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ సమావేశంలో తీర్మానించారు. చైర్మన్ డాక్టర్ నయినాల వేణుగోపాల్ అధ్యక్షతన సమావేశం జరిగింది. కోనసీమ పరిధిలోని ప్రొడ్యూసర్ కంపెనీ ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. కొబ్బరి ధరలు దారుణంగా పతనమైన నేపథ్యంలో కొబ్బరి రైతుల సమస్యలపై పోరాటం సాగించాలని సమావేశంలో నిర్ణయించారు. కొబ్బరికి కనీస మద్దతు ధర లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సమావేశంలో పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కొబ్బరికి మద్దతు ధర సాధించడం, కొబ్బరి రైతుల హక్కులను సాధించుకోవడం కోసం రాష్ట్ర కోకోనట్ ఎఫ్‌పీఓ కన్సార్టియంగా ఏర్పడ్డారు. దీని ద్వారా కొబ్బరి రైతుల సమస్యలపై పోరాటం సాగించాలని నిర్ణయించారు.

పశువులకు వ్యాక్సిన్ వేయించాలి

అంబాజీపేట: ప్రతి పశువుకు వ్యాధి నిరోధక టీకాలను వేయించి వాటి సంరక్షణకు రైతులు కృషి చేయాలని పి.గన్నవరం ఏడీ ఏహెచ్ డాక్టర్ ఎల్.విజయరెడ్డి అన్నారు. గంగలకుర్రు అగ్రహారంలో మేకలు, గొర్రెల్లో పారుడు వ్యాధి (పీసీఆర్) నివారణకు మండల పశువైద్యాధికారి డి.రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన టీకాల కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పశువులు వ్యాధుల బారిన పడకుండా రైతులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. మేకలు, గొర్రెల్లో పారుడు వ్యాధిని అరికట్టేందుకు తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు.

లబ్ధిదారులకు అర్హతే ప్రామాణికం

- ఎమ్మెల్యే రాపాక
- పొదలాడలో గడప గడపకూ..



పొదలాడలో లబ్ధిదారుడికి బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

రాజోలు: రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారుల ఎంపికలో అర్హతే ప్రామాణికంగా తీసుకుని సంక్షేమ పథకాలను అందిస్తుందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శుక్రవారం పొదలాడలో కంచి కామాక్షమ్మ, బీసీ కాలనీ, మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు అందిన సంక్షేమ పథకాలను వివరించారు. రాబోయే ఎన్నికల్లో సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ రాష్ట్రంలో అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలు అనేక ఇతర రాష్ట్రాలు ప్రారంభిస్తున్నాయన్నారు. లబ్ధిదారులు నేరుగా గ్రామ సచివాలయంలో వలంటీరు ద్వారా దరఖాస్తు చేసుకుంటే అర్హత ఒక్కటే ప్రాతిపదికన సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. నాడు-నేడు పథకంలో పాఠశాలలను పూర్తి స్థాయిలో రూపురేఖలు మార్చివేసి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తయారు చేశారన్నారు. నిరుపేదలకు పైసా ఖర్చులేకుండా చికిత్స, వైద్యసేవలు అందించే దిశగా వైద్య రంగాభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. గతంలో ఎన్నడూ లేని రీతిలో కొత్తగా ఏర్పాటైన జిల్లాల్లో మెడికల్ కాలేజీలు నిర్మాణం చేపట్టారన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, మాజీ ఏఎంసీ చైర్మన్ గెద్దాడ సత్యనారాయణ, నాయకులు కంచర్ల శేఖర్, లిఖితపూడి బుజ్జి, కంబాల చంద్రరావు, గెద్దం సురేష్, కొల్లాబత్తుల సతీష్, పంచాయతీ కార్యదర్శి ఎం.కృష్ణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో మెరుగైన ఫలితాలు



మేడిచర్లపాలెంలో జగనన్న సురక్ష సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన ఫలితాలు లభిస్తాయని జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా పేర్కొన్నారు. మండలంలోని మేడిచర్లపాలెంలో శుక్రవారం ఆరోగ్యశాఖ నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతి ఇంటిని జల్లెడ పట్టి ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకోవడంతో పాటు వాటిని పరిష్కరించే గొప్ప బాధ్యతను ప్రభుత్వం తీసుకుందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, మండల పార్టీ అధ్యక్షులు అడబాల వీర బ్రహ్మాజీరావు, మాజీ ఎంపీపీ ముత్యాల కాశీ, కానూరి బాబి తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో వలంటీర్లు, ఏఎన్ఎంలతో కలసి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొని జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పిలుపునిచ్చారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్షలో నియోజకవర్గంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. ప్రజలు మరింత మెరుగైన వైద్య సేవలు ఇళ్ల వద్దే అందించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహోత్తర కార్యక్రమం చేపట్టారన్నారు. గ్రామంలోని ప్రతి రోగికి నూటికి నూరు శాతం ప్రభుత్వం వైద్య సేవలు అందుతాయనే లక్ష్యంగా ఈ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు.


మురుగు సమస్యకు చర్యలు తీసుకోండి

కొత్తపేట: స్థానిక కమ్మిరెడ్డిపాలెం ప్రాంతంలో మురుగునీటి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆ ప్రాంతంలో మురుగునీరు పూర్వం నుంచి కౌశిక డ్రైన్‌కు వెళ్లే బోదె విషయంలో వివాదం తలెత్తి, మురుగుపోయే మార్గం లేక గత కొంతకాలంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా స్థానికులు ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని కలసి సమస్య పరిష్కరించాలని కోరారు. దానిపై ఆయన స్పందించి, శుక్రవారం ఆ ప్రాంతానికి వెళ్లి స్థానిక పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. తాళ్లమ్మరావి నుంచి పనసలదొడ్డి వెళ్లే రోడ్డు వెంబడి మురుగుబోదెను రెండు జేసీబీలతో బాగు చేయించేందుకు చర్యలు తీసుకున్నారు. అలాగే కొత్తగా వేసిన లేఅవుట్, నివాస గృహాల మధ్య నుంచి డ్రైన్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులను ఆదేశించారు.

పాముకాటుతో మహిళ మృతి

అయినవిల్లి: పాముకాటుకు గురై మండలంలోని మడుపల్లిలో ఓ మహిళ శుక్రవారం మృతి చెందిన ఘటన చేసుకుంది. దీనికి సంబంధించి స్థానిక ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయినవిల్లి మండలం మడుపల్లికి చెందిన గుబ్బల సీతారత్నం(52) గ్రామంలో పోలం పనులు చేసేందుకు వెళ్లింది. అక్కడ పాముకాటు వేయడంతో స్థానికులు వైద్యం కోసం కొత్తపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. దీనిపై సీతారత్నం కుమారుడు తాతాజీ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సమరయోధులను సమాజం మరువదు



పి.గన్నవరంలో అడ్డగళ్ల అచ్యుతరామయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అయ్యాజీవేమా

పి.గన్నవరం: స్వాతంత్య్ర సమరయోధులు దేశానికి అందించిన సేవలను సమాజం ఎన్నిటికీ మరువదని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా అన్నారు. నా మట్టి-నా దేశం కార్యక్రమంలో భాగంగా పి.గన్నవరానికి చెందిన ప్రముఖ స్వాతంత్య్ర సమర యోధుడు అడ్డగళ్ల అచ్యుత రామయ్య చిత్రపటానికి వేమా పూలమాల వేసి, నివాళులు అర్పించారు. ఆయన కుమారులు రవీంద్రనాథ్ సూర్యచంద్రబోస్, నారాయణమూర్తి సోదరులను బీజేపీ నాయకులు దుశ్శాలువాలతో సత్కరించారు. పార్టీ నాయకులు చెరుకూరి గోపాల కృష్ణ, చీకరమెల్లి శ్రీనివాసరావు, యర్రంశెట్టి సాయిబాబు, తిక్కా సత్తిబాబు, అడ్దాల వెంకటేశ్వరరావు, మోకా ప్రసాద్, మేడిది సత్యనారాయణ, దిగుమర్తి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: బీజేపీ ఆధ్వర్యంలో నా భూమి-నా దేశం కార్యక్రమం ఈదరాడ, కొమరాడ గ్రామాల్లో శుక్రవారం జరిగింది. దీనిలో భాగంగా బీజేపీ నేతలు ఇంటింటికి వెళ్లి మట్టిని సేకరించారు. స్వాతంత్య్ర సమరయోధుల సేవలను, వారి త్యాగ నిరతిని కీర్తించారు. మొక్కలు నాటారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మెండా ఆదినారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నేతలు కంకిపాటి సుబ్బారావు, వేగి వెంకటేశ్వరరావు, పసుపులేటి మహాలక్ష్మీరావు, నక్కా త్రిలోచనరావు, కటికిరెడ్డి తమ్మయ్యనాయుడు, అడపా వెంకటరత్నం, ఆకుల దొరబాబు, కోటిపల్లి సాయిబాబు, ఏడిద బాబులు, యర్రంశెట్టి నాయుడు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

అంబాజీపేట: ఉపాధి హామీ పథకం పనులపై మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదిక శనివారం ఉదయం 10 గంటలకు అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహిస్తామని ఎంపీడీఓ కె.సత్యనారాయణ తెలిపారు. ఏప్రిల్ 01, 2022 నుంచి మార్చి 31, 2023 వరకూ మండలంలో నిర్వహించిన 15వ విడత జాతీయ గ్రామీణ ఉపాధి పనులపై ఈ ప్రజావేదిక జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, ఉపాధి హామీ క్షేత్ర స్థాయి సిబ్బంది పాల్గొనాలని ఆయన కోరారు.

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



అండర్-14 జిల్లా స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పీఈటీ రామకృష్ణ

రావులపాలెం: మండలంలోని ఈతకోట జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికైనట్టు పీఈటీ టి.రామకృష్ణ తెలిపారు. శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో కొత్తపేటలో జరిగిన పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయికు ఎంపికయ్యారన్నారు. అండర్-14 విభాగంలో సీహెచ్ ప్రణీత్, ఎ.విజయ్‌కుమార్, బి.తేజ త్రోబాల్‌కు ఎంపికైనట్టు తెలిపారు. అలాగే ప్రణీత్ కూడా కబడ్డీకి ఎంపికయ్యాడన్నారు. మరో ముగ్గురు విద్యార్థులు అండర్-17 విభాగంలో ఎం.సత్యప్రకాష్, సీహెచ్ నిఖిల్ త్రోబాల్‌కు ఎంపిక కాగా, ఎం.మణికంత కబడ్డీకి ఎంపికైనట్టు హెచ్ఎం కేఎస్‌వీ కృష్ణారెడ్డి తెలిపారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

అయినవిల్లి: వీరవల్లిపాలెం ముద్రగెడ నాగయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన ఆడుదాం ఆంధ్ర పోటీలలో భాగంగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అయినవిల్లి మండల స్థాయి బాలుర క్రీడా పోటీల్లో భాగంగా కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ పోటీల్లో విజేతలకు స్థానిక సర్పంచ్ సలాది బుచ్చిరాజు చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అడబాల సత్యనారాయణ, ఎంఈఓ శ్రీనివాస్, విద్యా కమిటీ చైర్మన్, వివిధ పాఠశాలలకు చెందిన వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షిక వేదసభ

రావులపాలెం: స్థానిక సత్యసాయి సేవా కేంద్రంలో శుక్రవారం సాయంత్రం 29వ వార్షిక వేదసభను వైభవంగా నిర్వహించారు. ఈ సభకు బ్రహ్మశ్రీ శ్రీపాద మాణిక్యావధాని అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా బ్రహ్మశ్రీ చిర్రావూరి శ్రీరామశర్మ పాల్గొన్నారు. ఈ సభలో 17 మంది గురు ఘనాపాఠీలు, 51 మంది కృష్ణ యజుర్వేదం క్రమ పాఠీలు, 14 మంది శుక్ల యజుర్వేదం క్రమ పాఠీలు, ఋగ్వేద పండితులు ఇద్దరు, సామవేదం పండితులు ఐదుగురు, అధర్వణ వేదం పండితులు తొమ్మిది మంది, స్మార్త పండితులు 42 మంది పాల్గొన్నారు. సమస్త ప్రజలు సుఖశాంతులతో ఉండాలని సంకల్పంతో చతుర్వేద పారాయణ చేశారు. అనంతరం వీరందరినీ సేవా సమితి సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో సత్యసాయి ట్రస్ట్ చైర్మన్ కొవ్వూరి వివేకానందరెడ్డి, కొంపెల్ల రామ సోమయాజులు, కుసుమంచి గంగాధర్ రావు, కొత్త శ్రీనివాస రావు, కుసుమంచి నాగపుల్లేశ్వరరావు, చిన్నం భాస్కర్‌రెడ్డి, మన్యం పర్వత వర్ధన రావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ

పి.గన్నవరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేస్తున్నారని జి.పెదపూడి సర్పంచ్ దంగేటి అన్నవరం అన్నారు. గ్రామంలో కొత్తగా 20 మందికి వృద్ధాప్య, మూడు వికలాంగ, మూడు వితంతు పింఛన్లు మంజూరయ్యాయి. వీటిని లబ్ధిదారులకు సర్పంచ్ అన్నవరం శుక్రవారం గ్రామ సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా వాణిజ్య విభాగం నాయకుడు మంతెన రవిరాజు, ఎంపీటీసీ పల్లి మోషే, వీఆర్వో కె.భగవాన్, ఉప సర్పంచ్ చీకురుమిల్లి వెంకట్రావు, కత్తుల విక్టర్‌బాబు, వెల్ఫేర్ అసిస్టెంట్ జి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

మామిడికుదురు: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు సూచించారు. ఆయన శుక్రవారం లూటుకుర్రు జెడ్పీ ఉన్నత పాఠశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థుల కోసం తయారు చేసిన అన్నంతో పాటు కూరలను రుచి చూశారు. ప్రతి రోజు పెడుతున్న ఆహారం ఎలా ఉంటుందని విద్యార్థులను ఆయన అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పెట్టే ఆహారం నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని అంజిబాబు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం జి.నాగప్రసాద్, సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడండి

అయినవిల్లి: మట్టి గణపతులను పూజించడం ద్వారా పర్యవవరణాన్ని రక్షించుకోవచ్చని అలా కాకుండా సింథటిక్, ప్లాస్టిక్, కెమికల్స్‌తో చేసిన గణపతి ప్రతిమలతో పర్యావరణం దెబ్బతింటుందని తద్వారా మనకు హాని కలుగుతుందని స్థానిక సర్పంచ్ సలాది బుచ్చిరాజు అన్నారు. వీరవల్లిపాలెం ముద్రగడ నాగయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మట్టిగణపతులతో మేలు జరుగుతోందని మట్టి ప్రతిమలనే వినాయక చవితి పూజల్లో వినియోగించాలని విద్యార్థులు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అడబాల సత్యనారాయణ, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

అంబాజీపేట: సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సర్వశిక్షాభియాన్ ఏపీఓ ఏఎంఓ భీమారావు అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం కె.సాయిరామ్ అధ్యక్షతన స్వచ్ఛ పక్వాడా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆహారం తీసుకునే సమయంలో చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకంపై రైతులకు అవగాహన

ఆత్రేయపురం: మండలంలోని వద్దిపర్రు, రాజవరం గ్రామాల్లో ఆత్రేయపురం రైతు ఉత్పత్తిదారుల సంస్థ సీఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాబార్డు డీడీఎం డాక్టర్ స్వామినాయుడు, మండల వ్యవసాయ అధికారి పట్టాభిరామయ్య రైతులకు అవగాహన కల్పించారు. తేనెటీగల పెంపకం, ప్రభుత్వ రాయితీల గురించి వివరించారు. తేనెటీగల పెంపకంగా గురించి వాటి లాభాల గురించి వివరించారు. కార్యక్రమంలో సాంకేతిక ఇన్‌చార్జి భావన కృష్ణ, జిల్లా కోఆర్డినేటర్ విజయకుమార్‌రెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

దోమలతో అప్రమత్తత అవసరం

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో దోమలు విపరీతంగా పెరిగిపోయాయని వాటి పట్ల అప్రమత్తంగా ఉంటూ నివారణకు చర్యలు తీసుకోవాలని అమలాపురం ఎన్‌వీబీడీసీపీ సబ్‌యూనిట్ అధికారి పీఎస్‌వీ రాజ్‌కుమార్, అంబాజీపేట వైద్యాధికారి కెఎస్ శ్రీనివాస్ అన్నారు. గంగలకుర్రు అగ్రహారం శివారు ప్రసాద్‌నగర్ కాలనీలో ఫ్రైడే కార్యక్రమాన్ని సీహెచ్ఓ బి.అప్పారావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మన చుట్టూ ఉండే పరిసరాల్లో చెత్తా చెదారం లేకుండా చేయడం వల్ల దోమలను నివారించవచ్చన్నారు. దోమల వల్ల వచ్చే వ్యాధులను వివరించారు. అనంతరం వ్యాక్సిన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ దుర్గాప్రసాద్, ఎంపీహెచ్ఏ జీవీవీకే ప్రసాద్, ఏఎన్ఎం రాజేశ్వరి, ఆశా కార్యకర్త మేరీ ప్రమీల, పల్లవి, కృపావతి తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ నిర్లక్ష్యం: విద్యార్థినులకు గాయాలు

కొత్తపేట: స్థానిక మారుతీ సెంటర్‌లో కళాశాల విద్యార్థినులు ఆర్టీసీ బస్ ఎక్కుతుండగా డ్రైవర్ బస్ ముందుకు పోనివ్వడంతో నలుగురు విద్యార్థినులు గాయపడ్డారు. స్థానికులు, విద్యార్థినులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక సిద్దార్థ, శతాబ్ది కళాశాలకు ముక్కామల వైపు నుంచి, రావులపాలెం విద్యార్థులు ప్రతీరోజు ఆర్టీసీ బస్‌లపై వచ్చి మారుతీ సెంటర్‌లో దిగి, ఎక్కి వెళుతుంటారు. దానిలో భాగంగా శుక్రవారం సాయంత్రం పలువురు విద్యార్థులు అమలాపురం వైపు వెళుతున్న ఆర్టీసీ బస్ ఎక్కుతుండగా బస్ డ్రైవర్ షడన్‌గా ముందుకు పోనివ్వడంతో నలుగురు విద్యార్థినులు కిందికి పడిపోయారు. ఈ విషయాన్ని కళాశాలల యాజమాన్యం పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ కట్టా నాగమోహన్ కోరారు.

రెండు ఆలయాల్లో చోరీ

మామిడికుదురు: మగటపల్లిలోని శివాలయంతో పాటు వేంకటేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజామున గుడి తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. రెండు ఆలయాల్లో ఉన్న సీసీ కెమెరాలను ధ్వంసం చేసి హుండీలను బద్దలగొట్టి అందులో ఉన్న కానుకలను దోచుకువెళ్లారు. సీసీ కెమెరాలకు సంబంధించిన హార్డ్ డిస్కులను కూడా దొంగలు అపహరించారు. ఎనిమిది నెలల నుంచి హుండీలను తెరవలేదని, భక్తులు వేసిన కానుకలు హుండీల్లోనే ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

కిడ్నీ బాధితునికి రూ.20 వేల సాయం



కిడ్నీ బాధితుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న జనసేన నేతలు

మామిడికుదురు: రెండు కిడ్నీలు దెబ్బతిని హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పెదపట్నం లంక గెడ్డంవారిపేటకు చెందిన పల్లి ఏడుకొండలు కుటుంబానికి గురువారం జనసేన ఆధ్వర్యంలో రూ.20 వేల ఆర్థికసాయం అందించారు. జనసేన ఎన్ఆర్ఐ విభాగం నేత యల్లమెల్లి బుజ్జి బృందం సేకరించిన రూ.13 వేలతో పాటు జనసేన పార్టీ మండల శాఖ సేకరించిన రూ.7 వేలు వెరసి రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని బాధితుని కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు, నగరం ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్ముల కొండలరావు, ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు జాలెం శ్రీనివాసరాజు పాల్గొన్నారు.